

కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డితో కలిసి అహోబిలమఠంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు దంపతులు

# వైకుంఠ ఏకాదశి పూజలు

అంబర్‌పేట, డిసెంబర్ 23: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని అంబర్‌పేట నియోజకవర్గంలో ఉన్న దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జాము నుంచే భక్తులు ఉత్తర ద్వార దర్శనానికి క్యూ కట్టారు. ఛే నంబర్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయం, అహోబిల మఠంలోని శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవాలయం, శ్రీగురువాయూర్ ఆలయంలో భక్తులు ఉత్తరద్వార దర్శనం చేసుకున్నారు. ఛే నంబర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ దంపతులు స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. అహోబిలమఠంలో కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డితో కలిసి ఎమ్మెల్యే దంపతులు స్వామివారి పూజల్లో పాల్గొన్నారు. అలాగే గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్ కూడా ఛే నంబర్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పూజలు చేశారు. భక్తుల కోసం ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.



ఛే నంబర్‌లోని వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న కార్పొరేటర్ లావణ్యశ్రీనివాస్‌గౌడ్



ఛే నంబర్ శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు క్యూ కట్టిన భక్తులు

# చిక్కడపల్లిలో ముఠా గోపాల్ పూజలు


చిక్కడపల్లి, డిసెంబర్ 23 : చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామి వారి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. ఉదయం 5 గంటల నుంచి భక్తులు పెద్ద ఎత్తున్న తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ దంపతులు, మాజీ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి భూసాని వేంకటేశ్వర రా వు, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్ వి. శ్రీనివాస్ రెడ్డి, ముఠా పద్మ స్వామి వారిని దర్శించుకున్నారు.

**శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో..**

చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో శనివారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఉత్తరద్వార దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమాలను కార్యనిర్వాహణాధికారి మాచర్ల దేవనాథం, చైర్మన్ పద్మ బాసాని పర్యవేక్షించారు.



స్వామివారి దర్శనం అనంతరం ఎమ్మెల్యే ముఠా గోపాల్ దంపతులను సత్కరించిన అర్చకులు



ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని వేంకటేశ్వరస్వామి వారిపూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ పావని



శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం క్యూలో వస్తున్న భక్తులు

## మందుబాబులపై కేసు నమోదు

కాచిగూడ, డిసెంబర్ 23: మందు బాబులపై కాచిగూడ ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝులిపించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి బర్కత్‌పుర ఎక్స్‌రోడ్ సమీపంలో ట్రాఫిక్ సిబ్బందితో కలిసి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 10 మంది వాహనదారులపై కేసు నమోదు చేశారు. ఇందులో 9 ద్విచక్ర వాహనలు, త్రీ వీలర్ వాహనం పట్టుబడ్డాయి. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలను నడుపరాదని, అలా ప్రవర్తిస్తే జరిమానాతోపాటు లైసెన్స్‌కూడా రద్దవుతుందని హెచ్చరించారు. తాగుడుకు బానిసై తమ విలువైన ప్రాణాలను పోగొట్టుకోవద్దని, కుటుంబ సభ్యులను దృష్టిలోపెట్టుకొని వాహనాలను నడపాలని సూచించారు.

## ద్విచక్ర వాహనం ఢీకొని మహిళకు గాయాలు

కాచిగూడ, డిసెంబర్ 23: రోడ్డు దాటుతుండగా మహిళను ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలైన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై డి.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. బర్కత్‌పురలోని రాజేంద్రనగర్ కాలనీ ప్రాంతానికి చెందిన విఠల్ భార్య గంగమ్మ(54)శుక్రవారం బర్కత్‌పురలో రోడ్డు దాటుతుండగా ఏపీ 12 ఎల్ 5948 నంబర్ గల ద్విచక్ర వాహనం గంగమ్మను ఢీకొనడంతో ఆమె ఎడమ చెయ్యి విరిగిందని తెలిపారు. గంగమ్మ ఫిర్యాదు మేరకు ద్విచక్ర వాహనదారుడిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## డివిజన్ అభివృద్ధికి కృషి

కాచిగూడ, డిసెంబర్ 23: నిరంతరం డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేశ్‌యాదవ్ అన్నారు. డాక్టర్ భూమన్నలైన్‌లో వేస్తున్న డ్రైనేజీపైప్‌లైన్ పనులను కార్పొరేటర్ శనివారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లో మురికి నీరు రాకుండా చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కన్నె రమేశ్‌యాదవ్, జలమండలి ఏఈ భావన, మల్లికార్జున్, భీంరాజ్, రవియాదవ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



భూమన్నలైన్‌లో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉమ, అధికారులు

## ఫిలిం సర్టిఫికెట్ అడ్వయిజరీ కమిటీ మెంబర్‌గా అచ్చిని రమేశ్



అంబర్‌పేట, డిసెంబర్ 23: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికెట్ అడ్వయిజరీ కమిటీ మెంబర్‌గా బాగ్అంబర్‌పేట డివిజన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు అచ్చిని రమేశ్ నియమితులయ్యారు. భారత ప్రసార మంత్రిత్వ శాఖ ఆయనను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా రమేశ్ తనకు అవకాశం కల్పించిన కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డా.ఎన్.గౌతంరావులకు ధన్యవాదాలు తెలిపారు.

## నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, డిసెంబర్ 23 : బొడుప్పల్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కూర బాలరాజు, గోకుల సత్యనారాయణ, నాగుల లింగమూర్తి, రాజేశ్వర్, జగన్నాథం, రాజేందర్, పాక శ్రీనివాస్, పూస యాదగిరి పాల్గొన్నారు.

## దివ్యాంగులకు సన్మానం..



అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగులను సత్కరించిన కావ్యారెడ్డి, కార్పొరేటర్లు ఉమ, అమృత తదితరులు

కాచిగూడ, డిసెంబర్ 23: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా శనివారం బర్కత్‌పుర కార్యాలయంలో 120 మంది దివ్యాంగులను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి భార్య కావ్యారెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతంరావు, కార్పొరేటర్లు ఉమాయాదవ్, అమృత, గీతామూర్తి, రమేశ్‌యాదవ్, కేశబోయిన శ్రీధర్, అజయ్, జ్యోతి పాల్గొన్నారు.

## దేశానికి పీవీ చేసిన సేవలు చిరస్మరణీయం



దేశానికి పీవీ నర్సింహారావు చేసిన సేవలు చిరస్మరణీయమని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్ రెడ్డి కొనియాడారు. ఈ మేరకు శనివారం స్వర్గీయ మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు వర్ధంతి సందర్భంగా నెక్లెస్ రోడ్డులోని పీవీ విగ్రహానికి ఆయన పూల మాల వేసి నివాళులర్పించారు.

– కవాడిగూడ, డిసెంబర్ 23

## పెంచిన ఫీజులను తక్షణమే తగ్గించాలి..

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 23: రాష్ట్రంలోని ప్రభుత్వ యూనివర్సిటీలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి డిమాండ్ చేశారు. వర్సిటీల సమస్యలపై ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో శనివారం నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ ఓయూ కార్యదర్శి రవినాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఓయూలో పెంచిన పీజీ, పీహెచ్‌డీ కోర్సుల ఫీజులను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. ఓయూ భూములను కబ్జాదారుల నుంచి పరిరక్షించి, శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. ఓయూ అభివృద్ధికి వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. హాస్టళ్లలో కనీస మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఆంజనేయులు, సాయికిరణ్, శ్రీను, కృష్ణ, రాజు, శ్రీకాంత్, స్వాతి, సందీప్, యశ్వంత్, హుస్సేన్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

## వివిధ కోర్సుల పరీక్షల తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 23: ఓయూ పరిధిలోని వివిధ కోర్సులకు నిర్వహించినున్న పరీక్షల తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొ. రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీసీఏ మొదటి, మూడు, అయిదో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్, రెండు, నాలుగో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను వచ్చే నెల 3వ తేదీ నుంచి, బీఫార్మసీ వన్‌టైం చాన్స్ అన్ని సెమిస్టర్ల పరీక్షలను వచ్చే నెల 17వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.